క్లుప్తంగా

9న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు

పెన్‌పహాడ్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చే నెల 9న సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బంటు చొక్కయ్యగౌడ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాసరి కోటయ్య, ఆనంద్, కొమ్ములయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నాగారం : మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి జన్మదినం సందర్భంగా నాగారం ఎక్స్‌రోడ్డులో కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని సాయినగర్ సాయిబాబా ఆలయంలో సోమవారం సోమవతి అమావాస్య సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. సోమవతి అమావాస్య ప్రత్యేక పూజలు జరిపారు. వేడుకలో ట్రస్ట్ చైర్మన్ సవరాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు వలివేటి విశ్వేశ్వర శర్మ, మామిళ్లపల్లి గంగాధర్ శర్మ పాల్గొన్నారు.

బురద దారితో ఇక్కట్లు



బురదమయంగా ఉన్న మోడల్‌స్కూల్ దారి

నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌కు వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పసునూర్ స్టేజీ నుంచి సుమారు 400 మీటర్ల దూరంలో పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో సుమారు 740 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల వర్షాలకు ఈ దారి పూర్తిగా కంకరతేలి, గుంతలుపడి, బురదమయంగా మారింది. దీంతో బురదదారి గుండానే విద్యార్థులు పాఠశాలకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పసునూర్ స్టేజీ నుంచి పాఠశాలకు సీసీరోడ్డు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మృతుడికి నివాళి

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకన్న మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నీలాల సతీష్, గోపాల్దాసు సైదులు, వీరయ్య, గణేష్, వీరబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోదాడరూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక రకాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గ్రామ సమన్వయకర్త, కూచిపూడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని గుడిబండలో నిర్వహించిన బీఆర్‌ఎస్ వార్డు ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఎండీ.సలీం, మహిళా అధ్యక్షురాలు గీత, కోటిరెడ్డి, అనంతరాంరెడ్డి, భిక్షం, శేషు, సత్యనారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పథకాలను వివరిస్తున్న నాయకులు

పుస్తకాల్లేకుండా చదువుకునేదెలా..

- స్కూళ్లు తెరచి నెలరోజులైనా పూర్తి స్థాయిలో రాని పాఠ్యపుస్తకాలు
- ఇప్పటివరకు సగం మంది విద్యార్థులకు మాత్రమే పంపిణీ



అర్వపల్లి ఎమ్మార్సీలో పాఠ్యపుస్తకాలు (ఫైల్)

అర్వపల్లి : విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం, పాలకులు చెబుతున్నా అది అమలులో కనబడడంలేదు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు అవుతోంది. కానీ ఇంతవరకు సగం మంది పిల్లలకు మాత్రమే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందాయి. మిగిలిన సగం మంది పిల్లలు పుస్తకాలు లేక చదువులకు ఇబ్బంది పడుతున్నారు. మిగిలిన వారికి పుస్తకాలు ఇంకా రావాల్సి ఉంది.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 30 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే ఒక కస్తూరిబా బాలికల విద్యాలయం ఉంది. వీటిలో సుమారు రెండు వేల మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు 20 వేల పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా ఇప్పటివరకు కేవలం 10 వేల పాఠ్య పుస్తకాలు మాత్రమే వచ్చాయి. దీంతో సగం మంది పిల్లలకు మాత్రమే పుస్తకాలు అందాయి. మిగతా వారు పాఠ్యపుస్తకాలు లేక చదువులకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. అయితే ఇప్పటివరకు కేవలం 4,700 నోట్ పుస్తకాలు మాత్రమే వచ్చాయి. ఇంకా సగానికి పైగానే నోట్ పుస్తకాలు రావాల్సి ఉంది. పాఠశాలలు తెరిచి నెల రోజులు దాటడంతో ఇప్పటికే పాఠాలు జరుగుతున్నాయి. కానీ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ చాలా మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చేసేదెమి లేక కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ దుకాణాల్లో నోట్ బుక్స్ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొనాల్సి వస్తుంది



ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ రాక విద్యార్థులు చదువుల్లో వెనకబడి పోతున్నారు. కొందరు పిల్లలు తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. నిరుపేద పిల్లలు పుస్తకాలు లేక ఆందోళన చెందుతున్నారు.

\- మచ్చ నర్సయ్య, విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు

ఇబ్బంది కాకుండా చూస్తున్నాం



విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇండెంట్ జిల్లాకు పంపించాం. మొదటి విడతలో కొన్ని వచ్చాయి. మరికొన్ని రావాల్సి ఉంది. పిల్లల చదువులకు ఇబ్బంది కాకుండా చూస్తున్నాం.

\- బాలునాయక్, ఎంఈఓ

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం



ఈటూరులో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వంగూరి దామోదర్

నాగారం : గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందని ఈటూరు గ్రామానికి చెందిన టెక్నోడీడ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వంగూరి దామోదర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్న తల్లిదండ్రులను కలిసి ప్రైవేటు పాఠశాలల దోపిడీపై అవగాహన కల్పించారు. గ్రామానికి ప్రైవేట్ స్కూల్ బస్సులు రాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడికి పంపించకుండా ప్రైవేట్ బడులకు పంపటం వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. విలువలతో కూడిన విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేరాల సరితయాదగిరి, హెచ్‌ఎం ప్రభాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ కొత్తోజు ఎల్లాచారి, పేరాల యాదగిరి, బోడ పరశురాములు, వంగూరి కుమార్, వంగూరి సందీప్, సురేష్, పేరాల రాజు, వంగూరి అవిలమల్లు, బోడ కళ్యాణ్, బోడ దిలీప్, వంగూరి అంజయ్య, పేరాల అబ్బాస్, పేరాల గోపి, పేరాల అవిలయ్య, దయానంద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వాణిజ్య శాఖగా మారిన ఎస్‌బీఐ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యవసాయ వాణిజ్య శాఖగా మారింది. ఇప్పటివరకు వాణిజ్య బ్యాంక్‌గా ఉండగా ఇక నుంచి వ్యవసాయ వాణిజ్య శాఖగా కొనసాగనుంది. దీంతో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంక్ నుంచి ప్రత్యేక రుణాలను ఇవ్వనున్నారు. ఉద్యాన శాఖ, పామాయిల్ తోటలు, హార్వెస్టర్ల కొనుగోలు, కూరగాయల తోటల ఏర్పాటు, పెద్ద డెయిరీ ఫాంలు తదితర వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు ఇస్తారు. త్వరలో గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు బ్రాంచి మేనేజర్ బదావత్ రామకృష్ణ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

నాగారం : మండల పరిధిలోని పేరబోయినగూడెం బిక్కేరు వాగు నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రహదారిబంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రాజెక్టుల పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు పేరబోయినగూడెం బిక్కేరువాగు నుంచి రోజుకు 300 లారీల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. ఇసుకను హైదరాబాద్‌లో వేల రూపాయలకు అమ్ముకుంటు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో అక్రమాలు, అవినీతి రాజ్యమేలుతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధిచెప్పాలని కోరారు. ఆయన తో పాటు కాంగ్రెస్ నాయకులు కందె అంజయ్య, పంజాల ప్రభాకర్, బండగొర్ల కుమార్, బుక్క శ్రీనివాస్, కొలిపాక సాయికుమార్, కొమ్ము నరేష్, రాజు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తుంగతుర్తి : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

తుంగతుర్తి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. సోమవారం గొట్టిపర్తి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టాలని, మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, సిరివంగి రాధ, నెమ్మాది స్రవంతి, ఇందిరా, ప్రియదర్శిని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : తెలంగాణకు హరితహారంలో భాగంగా ప్రతి ఇంట్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. పర్సాయపల్లి గ్రామ పంచాయతీ ఆవాసం తొట్టిబావితండాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో సోమవారం ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక పాల్గొన్నారు.

రూ.50వేల ఆర్థికసాయం అందజేత



నాగారం : ఆర్థికసాయం చేస్తున్న నాయకులు



తిరుమలగిరి : అనంతారంలో ఆర్థికసాయం అందజేస్తున్న చాగంటి రాములు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన కొమిరె అల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బాధితుడి చికిత్స నిమిత్తం రూ.50,000 ఆర్థికసాయం పంపించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న కొమిరె అవిలయ్యను పరామర్శించి, ఎమ్మెల్యే పంపించిన రూ.50వేలను బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఎర్ర యాదగిరి, వర్ధమానుకోట ఎంపీటీసీ వడ్డే పరశురాములు, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్, తీగుళ్ల యాదగిరి, పవన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థికసాయం

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన చాగంటి రామనర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు చాగంటి రాములు పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సతీష్, చరణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు సంఘటన దురదృష్టకరం



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి : కారంచేడు సంఘటన మానవ చరిత్రలోనే దురదృష్టకరమైనదని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సంఘటన జరిగి 37 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో కారంచేడు అమరులకు నివాళులర్పించి మాట్లాడారు. 1985 జూలై 17న అగ్రకుల అహంకారంతో దళితులపై దాడులు చేసిన అతి దురదృష్టకరమైన సంఘటన అన్నారు. ఈ సంఘటన అనుభవాలు గుర్తుతెచ్చుకొని ఇకనైనా పేదలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటికీ దళితులపైన, మైనార్టీలపైన హత్యలు, అత్యాచారాలు సర్వసాధారణమైనవని, దీనికి కారణం మనలో ఐకమత్యం లోపించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామోజీ, ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ వీరబాబు, శ్రీకాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరుమలగిరి : సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాద్ మాట్లాడారు. ఆన్‌లైన్ క్రైమ్, మొబైల్ అప్లికేషన్, ఓటీపీ సంబంధిత నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పిశ్లె, పోలీస్ సిబ్బంది రవీందర్, శేఖర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



తిరుమలగిరిలో సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్మికులు



చివ్వెంలలో భిక్షాటన చేస్తూ..



పెన్‌పహాడ్‌లో రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు

తిరుమలగిరి : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. సమ్మెలో బక్కయ్య, నాగయ్య, రాజు, శోభ, యాకయ్య, ప్రసాద్, నాగన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

దురాజ్‌పల్లి : గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 12వేల గ్రామపంచాయతీల్లో సుమారు 50 వేల మంది గ్రామపంచాయతీ సిబ్బందిగా పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం అందడం లేదన్నారు. అత్యధిక మంది ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల రజిత, చిన్నపంగ నరసయ్య, సీఐటీయూ పట్టణ కన్వీనర్ మామిడి సుందరయ్య పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల భిక్షాటన

చివ్వెంల : తమను రెగ్యులరైజ్ చేయాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా జీపీ కార్మికులు సోమవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం తమపై నిర్లక్ష్య ధోరణి వీడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగర్, భానోతు క్రిష్ణ, గోగుల ఈదయ్య, గోపాల్, రాంబాబు, లక్ష్మమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్) : దండు మైసమ్మ వద్ద పూజలు చేస్తున్న నూతనకల్ పంచాయతీ కార్మికులు



ఆత్మకూరులో సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

దండు మైసమ్మ తల్లికి పూజలు

ఆత్మకూరు (ఎస్) : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా తెలంగాణ ప్రభుత్వానికి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ నూతనకల్ మండలానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ మండల అధ్యక్షుడు నకిరికంటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన మండల గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు ఐఎఫ్‌టీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల నాయకులు హరిబాబు, సందీప్, వెంకన్న, అచ్చిరెడ్డి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో

పెన్‌పహాడ్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు సోమవారం మండల కేంద్రంలో సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనియాకుల శ్రీనివాస్ మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకన్న, నర్సయ్య, ఎల్లమ్మ, వెంకటమ్మ, సత్తెమ్మ, వెంకన్న, రమణయ్య, దూదియా పాల్గొన్నారు.



దురాజ్‌పల్లి : సూర్యాపేటలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

కార్మికుల వేతనాలు పెంచాలి

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు రూ. 20వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కారోబార్‌ల సంఘం జిల్లా నాయకుడు నకిరేకంటి శంభయ్య అన్నారు. సోమవారం నూతనకల్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ వర్కర్లు నిర్వహిస్తున్న 12వ రోజు సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం



మున్యానాయక్ తండాలో ఇళ్ల మధ్య ఉన్న చెత్తకుప్ప, పెంట దిబ్బలు



వాల్యతండాలో ఇళ్లమధ్య నిలిచిన మురుగు



మోదిన్‌పురంలో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

చివ్వెంల : గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ కార్మికులు గత పది రోజులుగా సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, దుకాణ సముదాయాలు, ఇళ్ల మధ్యన చెత్తాచెదారం పేరుకుపోతుంది. చెత్తను తొలగించేవారు లేకపోకవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీవర్కర్స్ విధానం తొలగించాలని, ఆదాయం ఉన్న జీపీల్లో వేతనం పెంచాలని, కారోబార్లు, బిల్లు కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా గుర్తించాలని, రూ.10 లక్షల బీమా కల్పించాలని తదితర డిమాండ్లతో జీపీ కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో గ్రామాల్లో చెత్త తొలగించేవారు లేక పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది.

వ్యాధులు ప్రబలే ప్రమాదం...

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా కీలకంగా మారాయి. ప్రతిరోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతివాడలో తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, రోడ్లను శుభ్రం చేయడం, విద్యుత్ పనులు, చేతిపంపుల వద్ద క్లోరినేషన్, మురుకు కాలువలు శుభ్రం చేయడం, అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ వేయడం, మురుగు నీరు ఇళ్ల మధ్యన నిలువకుండా చూడటం వంటి ఎన్నో పనులు పంచాయతీ కార్మికులు చేపడుతుండేవారు. ప్రస్తుతం కార్మికులు హాజరుకాకుండా సమ్మెలో ఉండటంతో పనులన్నీ నిలిచిపోయాయి. దీంతో మురికి కాలువలు చెత్తతో నిండిపోతున్నాయి. అపరిశుభ్ర పరిసరాల వల్ల ప్రాణాంతకమైన దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జీపీ కార్మికులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో వారు విరమించే వరకు తాత్కాలిక వర్కర్లను ఏర్పాటు చేసి చెత్తాచెదారం తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

\- టి.గోపి, ఎంపీఓ, చివ్వెంల

పాల సంఘం చైర్మన్ ఎన్నిక

మోతె : మోతె పాల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన బొడ్డు నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానికంగా ఎన్నికల అధికారి, విశ్రాంత ఉద్యోగి మెట్టు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో 10 మంది డైరక్టర్లు బొడ్డు నర్సయ్యకు మద్దతు తెలిపి ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బొడ్డు నర్సయ్య మాట్లాడుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిద్దాం

కోదాడ రూరల్ : గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని గిరిజనుల ఉద్యోగ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ధారాసింగ్, అధ్యక్షుడు సోమని నాయక్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బంజార ఉద్యోగుల యూనియన్ ఏర్పాటుకై నిర్వహించిన గిరిజన ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కానికై బంజార ఉద్యోగుల సంఘం ఏర్పాటుకు కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. సేవాలాల్ జయంతికి పబ్లిక్ హాలిడే ప్రకటించాలని, సీత్లా పండగకు ఆప్షనల్ హాలీడే ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పోలీస్ సేవా పతకానికి ఎంపికైన స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐ హనుమానాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భావసింగ్, రవీందర్‌నాయక్, రఘునాయ క్, సైదానాయక్, ఛత్రునాయక్ ఉన్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి

నడిగూడెం : టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంటరీ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆ పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దొంతగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పల్లపు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్తినేని సైదేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి భయ్యా నారాయణ, కొల్లు నర్సయ్య, సాతులూరి గుర్వయ్య పాల్గొన్నారు.

రథయాత్రను జయప్రదం చేయాలి

నడిగూడెం : సూర్యాపేటలో మంగళవారం నిర్వహించే ఓపీఎస్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుణగంటి నరసింహారావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విదానాన్ని పునరుద్ధరించాలన్నారు.